
**ఈవారం కథ**

# ఓ సండే కరిగిన వేళ!



"మావా! ఇయ్యాలైనా డూటీ నుంచి వచ్చేటప్పుడు ఏదైనా ఇల్లు సూసిరా! బయానా కూడా ఇచ్చేయి" సైకిలెక్కి బయల్దేరడానికి సిద్ధమవుతున్న భర్త చేతికి కేరియర్ అందిస్తూ మెల్లగా నాగుమణి గుర్తు చేసింది.

"మర్సిపోన్లేవే– ఇల్లు సూసేవస్తాను" పెడల్ జోరుగా వేస్తూ వెళ్తున్న భర్తను వీధి మలుపు తిరిగే వరకూ చూసి లోపలకొచ్చింది.

"అబ్బాయి డూటీ కెళ్లాడా?" కోడల్ని అడిగాడు ముసలాయన మంచం మీంచి లేచికూర్చుని.

"ఆ!" చీపురు తీసుకుని ఇల్లు ఊడుస్తున్న నాగుమణి చెప్పింది.

"రోజూ పొద్దున్నే కొడుకు సైకిల్ తీసి రోడ్డు మీద కెళ్లడం సూస్తాడు, తను భోజనం అందియ్యటం సూస్తాడు.. అయినా కొడుకు అలా ఎల్లంగానే 'డూటీకెళ్లాడా' అడుగుతాడు... ఎర్రి మాలోకం" నాగుమణికెందుకో చిరాకనిపించిందారోజు.

"ప్చ్! శానాదూరం.. వాలుక్కోసులుంటాది" నిట్టూర్చాడు కోడలిచ్చిన టీ గ్లాసు అందుకుంటూ.

ఉదయం ఆరుగంటలకు ఇంట్లో అందరూ పట్నంలోకి పోతారు పని కోసం. నాగుమణి తోడికోడలు లక్ష్మి ఆమె భర్త పిల్లలిద్దర్ని ఇంట్లో వదిలేసి తాపీ పన్లోకి వెళ్తారు. నాగుమణి అత్త కాలేజీ మాష్టర్లకు భోజనాలు తీసుకెల్తుంటుంది. లేచి లేవంగానే వంట చేసుకుని తలో ముద్దతిని, మరో ముద్ద సిల్వర్ కేరియర్‌లో సర్దుకుని పరుగులు తీస్తారు! చీకటి పడేవేళకు తిరిగొస్తారంతే.

నాగుమణి భర్త స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టర్ దగ్గర వండ్రంగి పని చేస్తాడు. ఇంటిల్లపాదీ కష్టపడ్తేగాని రోజులు గడవని పట్టణ జీవితం!

"నాగుమణీ! పిల్లలు బల్లో కెళ్లారా?" ఇంట్లోంచి కేకేశాడు.

"ఎల్లారు.." యధాలాపంగా అంది గుమ్మంలో తీరుబడిగా కూర్చుని.

తోడికోడలు పిల్లలు వీధి చివర్లో వున్న బడిలో కెళ్తున్నారు. నాగుమణి కష్టజెప్పి వెళ్తారు.

నాగుమణి అప్పటికింకా ఆ ఇంట్లోకి రాలేదు. క్వారీపన్లో ప్రమాదం జరిగి ముసిలాయన అవిటివాడయ్యాడు. ఆ నులక మంచం మీద రోజులు లెక్కపెడ్తున్నవాడిలా కన్పిస్తాడామెకు!

ఆమె కాపరానికొచ్చి మూడ్నెల్లవుతూంది. చిన్నప్పట్నించీ మారుమూల పల్లెలో వుట్టి పెరిగిన తనకు పట్నంలో ఉజ్జోగం చేస్తున్న భర్త దొరకటం గొప్ప వరమనుకుంది.! వ్యవసాయ కూలి అయిన నాగుమణి తండ్రి పట్నం అల్లుడు దొరికినందుకు సంబరపడిపోయాడు.

–మణిపాత్రుని రామకృష్ణారావు

"నాకేదైనా పని సూడండి మీతో పాటు నేనూవస్తాను" అడిగింది నాగుమణి ఇంట్లో పనిపాటు లేకుండా కూర్చోవటం విసుగనిపించి.

"ముద్దుగుమ్మడి వూవులాగున్నావు నీవా మొరటుపన్లు ఏం సేస్తావు?" అత్తా, తోటి కోడలు ఆమెను పన్లోకి పంపేందుకు ఒప్పలేదు.

కష్టసుఖాల్ని అంతా కలసి పంచుకుంటారు. అరమరికల్లేకుండా వుంటారంతా. ఆ చిన్న ఇంట్లో ఆస్‌బెస్టాస్ రేకులు కప్పిన ఒకే ఒక గది. ఆ జానెడు కొంపకు నెలకు వంద రూపాయిలు అద్దె అని తెల్సి ఆశ్చర్యపోయింది నాగుమణి మొదట్లో. వెనకాముందు కార్పొరేషన్ సైడ్ కాల్వలు—

ఇంటికొచ్చిన కొత్త కోడలు ఇబ్బంది పడిపోవటం చూసి కాలవకడ్డంగా రెండు నాపరాళ్ళు వేయించి గోనె పట్టాలతో మరుగుకట్టించింది స్నానాలకు నాగుమణి అత్త.

పుట్టింట్లో వైభోగం అనుభవించకపోయినా వాకిలి, పెరడులేని అగ్గిపెట్టిలాంటి ఆ ఇల్లూ, అటూ, ఇటూ ఊపిరిసలపని రద్దీ నాగుమణికి అసలు నచ్చలేదు!

రాత్రయిందంటే ఆ ఇరుకు తనం ఆమెను మరింత బాధిస్తుంది! చీకటి పడ్తూంటే ఆమె గుండెల్లో దడపుట్టుకొస్తుంది!

అందరూ ఆ ఒక్క గదిలోనే పడుకోవటం నాగుమణికి అదోలా వుంది— లక్ష్మి, ఆమె భర్త, పిల్లలు ఓ మూల పక్క లేసుకుంటారు. అత్తయ్య, ముసలాయన మంచం దగ్గర క్రింద పడుకుంటుంది. గదిలో ఓ చివరన ఒకే మంచం తనకూ, భర్తకూ. నాగుమణికి చచ్చేంత సిగ్గనిపిస్తుంది. కాళ్లా వేళ్లా మనుషులు అలికిడి! చీకట్లో భర్త స్పర్శ తగిల్తే చాలు కంపరం వుడ్తోంది!

ఆ గదిలోనే తోడికోడలు లక్ష్మి ఇద్దరు పిల్లల తల్లి ఎలా అయిందా అని ఆశ్చర్యపోతుంది నాగుమణి అప్పుడప్పుడూ!

వచ్చిన కొత్తల్లో—

ఓ రాత్రి రెండో ఆట వదిలిన అలికిడి వీధిలో సద్దుమణిగాక— భర్త మంచంలో తను ఒదిగిపోతుంటే— ఒక్కసారిగా గదిలో లైట్ వెలిగింది! అంతే తను బిత్తరపోయి కొయ్యబారిపోయింది!

ముసలాయన మంచినీళ్లు అడిగిన ట్లున్నాడు— అత్తయ్య లైట్ వేసింది.

నాగుమణి సిగ్గుతో ఒక్కచచ్చిపోయింది.

ఆ రోజు నుంచీ ఆ మంచం జోలికి పోలేదు.

కోర్కెల్ని మూటగట్టి భర్త మంచం దగ్గర కొంగు పరచుకుని పడుకోవడం అలవాటు చేసుకుంది! తన కోసం అర్ధరాత్రి దాటే వరకూ భర్త అటూ ఇటూ మంచంమీద కదుల్తుండడం— పాలు పొంగి, పొంగి ఇంకిపోతున్నట్లుగా తన పరిస్థితి— నిద్రపట్టని రాత్రుళ్లు— నాగుమణిని బాధిస్తుంటే వేరింటి కాపురం పోదామన్న నిశ్చయానికొచ్చింది.

ఇంతకంటే సాధింపులు, వేధింపులు లేవు. తనంటే అందరికీ అభిమానం ఆ ఇంట్లో. "చెల్లీ! చెల్లీ!" అంటూ ప్రాణం పెడ్తుంది లక్ష్మి. అత్త పన్లోంచి వస్తూ వస్తూ తనకూ, పిల్లలకూ వేడి వేడి బజ్జీలు తెస్తుంది రోజూ! 'పిన్నీ' అంటూ పిల్లలిద్దరూ క్షణం వదలరు.

నల్గురూ కష్టపడ్తారు కాబట్టి తిండికీ, గుడ్డకూ ఇబ్బంది లేదు.

"అన్నీ బాగానే వున్నాయి... కాని"

రాత్రికి వండాల్సిన బియ్యంలో రాళ్లేరుతూ గాఢంగా నిట్టూర్చింది నాగుమణి.

సాయంత్రమైంది. భర్త కోసం ఆత్రుతతో ఎదురుచూస్తోంది!

అల్లంత దూరాన చూసి ఎదురెళ్లింది.

సైకిల్ గోడకు చేరేసి ముఖం తుడుచుకుంటున్న భర్త చేతిలో కేరేజి అందుకుంటూ అతని కళ్లల్లోకి చూసింది.

"పెదవాళ్లేరుకాడే సూశాను— అద్దె ఎనభై రూపాయలంట— బయానా ఇచ్చేశాను.."

"ఎప్పుడెళ్దాం?" సంతోషంతో వెలిగిపోతున్న భార్య ముహంలోకి అదోలా చూశాడు.

"దార్లో పంతులుగార్ని కలిశాను— ఎల్లుండి శుక్రవారం మంచి రోజంట.. ఐనా ఈ ముసిలోళ్లకేం సెప్పాలా అని ఆలోసిస్తున్నా. అల్లు నొగ్గేసి ఎలిపోవాలంటే..." అతని గొంతులో బాధ గుర్తించలేకపోయింది సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతున్న నాగుమణి!

"అబ్బాయొచ్చాడా?" రోజూలాగే కొడుకు రావడం చూసి అడిగాడు.

"వచ్చేశానయ్యా" లోపలికొస్తూ తండ్రి ప్రక్కనే మంచంమీద కూర్చున్నాడు.

ఈలోగా అందరూ పన్లోంచి వచ్చారు.

"చెల్లీ! నీ కిష్టమని ఇయ్యాల పూర్ణా టాకీసు కాడ పిడతకింద పప్పు కొన్నాను.." తనకో పొట్లాం, పిల్లలకో పొట్లాం అందించి రోడ్డుమీదున్న పంపు దగ్గర కెళ్లి కాళ్లూ, చేతులూ కడుగుకుంటోంది లక్ష్మి.

పెద్దబండరాయి గుండెలమీదకెత్తుకున్నట్లుగా వుంది నాగుమణికి సాయంత్రం నుంచి!

ఇదివరకటిలా భోజనాల దగ్గర కబుర్లు చెప్పలేకపోతోంది!

గిన్నెలు సర్దేసి ఎవరి జాగాలో వాళ్లు పక్కలేసుకుంటున్నారు.

భర్త మంచం ప్రక్కనే కొంగుపరచుకుని పడుకుంది నాగుమణి.

"ఈ రెండ్రోజులే— ఆ తర్వాత ఏకువజామునే ఇద్దరమూ నిద్రపోయేది" వేరింటి కాపరాన్ని ఊహించుకుంటూంటే ఆమెకు నిద్రపట్టలేదు! చాలా రాత్రయింది.

ముసిలాయన లేచి కూర్చుని చుట్ట వెలిగించటం చూసింది.

"ఎప్పుడు నిద్రపోతాడో ఏమో— రాత్రి పగలూ అలా మేలుకునే వుంటాడు" అనుకుంది మనసులో.

"ఈ పాలీపాలని కొంపలో సిన్నోడు, కోడలు ఇబ్బంది పడ్తున్నట్లుగా వుంది.." అత్తయ్య గొంతు ఆ చీకట్లో చిన్నగా విన్పించేసరికి ఉలిక్కిపడింది!

"అవునే పాపం" నొచ్చుకున్నట్లుగా ముసిలాయన అన్నాడు.

"ఓ పనిసేద్దామా?"

"సెప్ప ఏంటో" ఆరిపోయిన చుట్ట వెలిగించాడు.

"టీల్‌ప్లాంటు దగ్గర ఏదైనా ఇల్లు సూసుకోమని అడుగుదాం.. నాగుమణిని సూస్తుంటే జాలేస్తుంది! ఎప్పుడూ ఆ నేలమీదే తొంగుంటుంది— ఆడదాన్నిగాబట్టి దాని మనసు అద్దంలా అగుపిస్తుంది నాకు"

అతనేమంటాడోనని ఊపిరి బిగబెట్టి వింటోంది.

రెండు నిమిషాల తర్వాత—

"నేను బతికినంత కాలం అందరం కలిసే వుందాం.. కొడుకులూ, కోడళ్లూ నా కళ్లముందర మెసల్తూ వుంటే నా ఈ కుంటితనాన్ని మర్చిపోతున్నానే.." గొంతు బొంగురుపోయిందతనికి.

"ఐనా నీ వెళ్లమంటే ఎల్తారేంటి.. నన్ను వొదిలిపోతారనుకున్నావా? నాగుమణి కన్నకూతుర్లా నన్ను పొద్దంతా సూస్తావుంటాది. అందరూ ఎలిపోతే ఈ కుక్కి మంచంలో నరకం అనుభవించాలి నేను.." నిశ్శబ్దంగా ఏడుస్తూ వుంటే నాగుమణికి ఆశ్చర్యంతో పాటు భయం కూడా వేసింది!

"నీవలా బాధ పడ్తే నేనేం సెప్పేది? నీ ఇష్టం.." అత్తయ్య ఆవులించి నిద్రలోకి జారిపోవటంతో నాగుమణి దీర్ఘంగా నిట్టూర్చింది.

చెదిరిన తేనెపట్టులా ఆలోచన్లు చుట్టుముట్టడంతో రాత్రంతా నిద్రపోలేదామె!

తెల్లవారింది—

భర్త సైకిల్ తీసి రోడ్డెక్కే టైమ్‌కు కేరేజి పట్టుకొచ్చింది.

"మనం ఎక్కడికీ ఎళ్లొద్దు— ఈడనే వుందాం.." ఆమె ముఖంలోకి తేరిపార చూశాడు.

"అవును మావా..! ఆ ఇల్లు వద్దని చెప్పేసిరా"

"బయానా ఇచ్చేశాను..?" భార్య మనసెందుకు మార్చుకుందో అర్థం కాలేదతనికి!

"పోతే పోయిందిలే— మన సుకం కోసం ఎలిపోతే ఆళ్లనెవరు సూస్తారు? మనకింకా అనుబవించేందుకు శానా టైముంది.. ఆళ్లకో.. పాపం పండుటాకుల్లా వున్నారు.. మన సరదాలు కొన్నాళ్లు లేకపోతేనేం!?"

ఆమె మాటలు చిత్రంగా అన్పించి సైకిల్ పట్టుకుని నిల్చుండిపోయాడు ఆమె కళ్లల్లోకి చూస్తూ!

'డూటీకెళ్లైంది.. ఎల్లిరా.." భర్తను పంపించి ఇంట్లో కొచ్చింది.

"అబ్బాయి డూటీ కెళ్లాడా?"

ఆ ముసలి తండ్రి రోజూ ఎందుకలా అడుగుతాడో నాగుమణి కర్థమైంది ఆ క్షణంలో! ◆